క్లుప్తంగా


గంగమ్మతల్లి గ్రామోత్సవం



డీసీపల్లిలో గంగమ్మతల్లికి విశేష పుష్పాలంకరణ

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని డీసీపల్లిలో కొలువై ఉన్న గంగమ్మతల్లి వార్షిక తిరునాళ్లలో భాగంగా ఆదివారం అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. చిన్నారుల కోలాటాలు, బాణసంచా సందడి, అమ్మవారి భక్తుల వీరాతాళ్ల తదితర విన్యాసాలతో గ్రామోత్సవం ఉత్సాహంగా సాగింది. సాయంత్రం మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు.

46 మి.మీ. వర్షపాతం



మర్రిపాడులో ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు పడుతున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో ఆదివారం 46 మి.మీ. వర్షపాతం నమోదైందని డివిజనల్ గణాంకాధికారి విజయ కుమారి తెలిపారు. సీతారామపురంలో 6 మి.మీ., ఉద యగిరిలో 4, మర్రిపాడులో 5.8, ఆత్మకూరులో 5.2, అనంతసాగరంలో 7.2 , అనుమసముద్రంపేటలో 2.2, సంగంలో 3, చేజర్లలో 3.2, కలువాయిలో 9.4 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైనట్లు వివరించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నియోజకవర్గ వ్యాప్తంగా ఆకాశం మేఘావృతమై తరచూ జల్లులు కురుస్తుండడంతో వాతావరణం చల్లబడింది. రోజు వారి జన జీవనం స్తంభించి ప్రజలు ఇంటి పట్టునే ఉంటున్నారు. రైతులు మరింత వర్షం కురిస్తే తమపొలాలు దుక్కులు చేసుకునేందుకు అనుకూలంగా ఉంటుందని అభిప్రాయ పడుతున్నారు.

కోనకాలువ శుభ్రం



కోనకాలువను శుభ్రం చేస్తున్న యువకులు

ఉదయగిరి: ఉదయగిరి వాసులకు నీరందించే కోన కాలువలో చెత్త చెదారం చేరి నీటి సరఫరాకు ఇబ్బందిగా మారింది. పంచాయతీ పాలకులు పట్టించుకోకపోవడంతో పట్టణానికి చెందిన కొంత మంది యువకులు ఆదివారం కోన కాలువను శుభ్రం చేశారు. దీంతో నీరు సజావుగా కాలువ చివరకు చేరుతోంది. పట్టణ ప్రజలు కోన నీరును తగినంత మేర తీసుకెళ్లుతున్నారు. దీంతో యువకుల సేవను పలువురు అభినందిస్తున్నారు.

అచ్చమాంబకు విశేష పూజలు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మండలంలోని పొంగూరు మాలిచేలో కొలువై ఉన్న అచ్చమాంబ పేరంటాళ్లకు ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో హాజరై విశేష పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ పూజారి అమ్మవారికి విశేష పూజలు, భక్తులకు ఆలయ పూజారి పాశర్లపూడి వెంకటేశ్వర్లు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

150 మందికి ఉచిత వైద్యసేవలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యురాలు

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లిలో శ్రీ సాయివరుణ్ క్లినిక్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ఆదూరుపల్లిని పీవీ సుబ్బయ్య ప్రథమ చికిత్సాలయంలో ఈవైద్య శిబిరాన్ని నిర్వహించారు. నెల్లూరుకు చెందిన వైద్యులు ఎం.సాయివరుణ్‌రెడ్డి, దీప్తిరెడ్డి రోగులను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. బీపీ, షుగర్, థైరాయిడ్, గుండె, గర్భకోశ వ్యాధులకు సంబంధించి రోగులను పరీక్షించారు. సుమారు 150 మంది రోగులను పరీక్షించారు. అనంతరం ఆర్ఎంపీ వైద్యులకు, రోగులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంపీ వైద్యుడు పీవీ సుబ్బయ్య పాల్గొన్నారు.

మహిళపై దౌర్జన్యం

చేజర్ల: మండలంలోని ఆదూరుపల్లిలో ఇటీవల దళిత మహిళ సంతోషమ్మపై కొందరు వ్యక్తులు దౌర్జన్యానికి పాల్పడినట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు విచారణ జరిపి పీర్ల పెంచలయ్య, పీర్ల కోటయ్య, సంకల శీనయ్యపై ఆదివారం కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.


‘ఉత్తే’రకుమారా..నారా!

ఊరూరా.. నారా ఉత్తరకుమార ప్రగల్భాలు, చిలుక పలుకులు వల్లించాడు. 2014 ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు ఐదేళ్ల పదవీ కాలం పూర్తయినా పట్టించుకుని బాబూ కొడుకులు.. ఇప్పుడొచ్చి అవే హామీలు గుప్పించడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికలకు ముందు హామీలు ఇవ్వడం.. మళ్లీ ఎన్నికల వేళ అవే ఉత్తుత్తి శిలాఫలకాలు వేయడం బాబూ కొడుకులకు అలవాటుగా మారింది. చంద్రబాబు హయాంలో వేసిన శిలాఫలకాలు సమాధి రాళ్లుగా మిగిలిపోయాయి. ఏ ఒక్క ప్రాజెక్ట్ కూడా కనీసం పునాదికి కూడా నోచుకోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాకే పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతోంది.

మళ్లీ అవే హామీలేనా.. కొత్తగా ట్రై చేయ్

- నాటి బాబు హామీలే..నేడు చినబాబు నోట
- 2014 ఎన్నికల్లో టీడీపీ ఇచ్చిన ప్రధాన హామీలు గాలికి
- నాలుగేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో ప్రగతి పథంలో ఉదయగిరి

ఉదయగిరి: టీడీపీ అధినేత చంద్రబాబు అధికారం కోసం అనేక ఉత్తుత్తి హామీలు ఇవ్వడం వెన్నతో పెట్టిన విద్య. అధికారంలో ఇచ్చిన హామీలను ఇచ్చేసినట్లు, పూర్తి చేసినట్లు భ్రమల్లో ఉండిపోతారు. అలాంటి హామీల్లో ఉదయగిరి అభివృద్ధికి అనేక హామీలు గుప్పించారు. 2014లో అప్పటి టీడీపీ అభ్యర్థి బొల్లినేని రామారావును గెలిపిస్తే మోడు బారిన ఉదయగిరి రూపు రేఖలు మార్చుతానని హామీ ఇచ్చారు. ప్రజలు నమ్మారు. ఆ ఎన్నికల్లో బొల్లినేని గెలిపించడంతో పాటు బాబు సీఎం అయ్యారు. గద్దెనెక్కిన బాబు చేసిన బాసలు మర్చియారు. ఐదేళ్లలో ఉదయగిరి అభివృద్ధి నీటి మాటలయ్యాయి. తాజాగా ఉదయగిరి ప్రజలను మోసం చేసేందుకు యువగళం యాత్రలో లోకేశ్ ఆయన బాబు ఇచ్చిన పాత హామీలే గుప్పించి నియోజకవర్గ ప్రజల్లో నవ్వులపాయ్యారు. తండ్రి ఇచ్చిన హామీలను అధికారంలో ఉండి చేయలేకపోయినా కొడుకు లోకేశ్ మళ్లీ అవే హామీలే ఇవ్వడంతో టీడీపీ క్యాడర్‌కే మైండ్ బ్లాక్ అయింది.



పర్యాటక హామీగా మిగిలిన ఉదయగిరి దుర్గం

పర్యాటకం ఊసే లేదు

ఉదయగిరి దుర్గంను పర్యాటకంగా అభివృద్ధి చేసి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని చెప్పిన హామీ బాబు అధికారంలోకి వచ్చిన తర్వాత మర్చిపోయారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పర్యాటక అభివృద్ధి కోసం రూ.100 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపారు. కానీ లోకేశ్ నాడు తండ్రి బాబు ఇచ్చిన హామీనే చదివి వినిపించారు.

వైద్యం అరకొరే

టీడీపీ హయాంలో ఉదయగిరి, వింజమూరులో సామాజిక ఆరోగ్య కేంద్రాలు నిర్మించారు. కానీ వైద్య సిబ్బంది లేరు. పరికరాలు ఊసే లేదు. కానీ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అవసరమైన మేరకు వైద్యులు, సిబ్బందిని నియమించారు. రూ.కోట్లు విలువ చేసే ఆధునిక పరికరాలు అందుబాటులోకి తెచ్చారు. అనేక మంది పేద రోగులకు కార్పొరేటు తరహాలో ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయి. త్వరలో వింజమూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు స్వయనా కలెక్టర్ పదిరోజుల క్రితం వింజమూరు సీహెచ్‌సీ తనిఖీ సందర్భంగా చెప్పారు. అయితే చినబాబు వింజమూరులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. మరి గతంలో ఎందుకు చేయలేదు.

ప్రాజెక్టుల నిర్మాణంలోనూ మాట తప్పిన బాబు

2014లో అధికారం కోసం వెలుగొండ ప్రాజెక్ట్‌లో అంతర్భాగమైన పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయర్‌ను పూర్తి చేస్తామని బాబు హామీ ఇచ్చారు. కానీ ఆ ఐదేళ్ల తట్టెడు మట్టి వేయలేదు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే సామెత చందగా మారింది. అయితే తమ్ముళ్లు మాత్రం కాలువలు, ప్రాజెక్ట్ మునక భూముల పేరుతో అవినీతికి పాల్పడి రూ.కోట్లు కొట్టేశారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో ప్రాజెక్ట్ పనులు దాదాపు తుది దశకు చేరుకున్నాయి. కానీ చినబాబు మాత్రం అధికారంలోకి వచ్చిన వెంటనే వెలుగొండ ప్రాజెక్ట్, పెద్దిరెడ్డిపల్లి రిజర్వాయరు పూర్తి చేస్తామని 2014లో తండ్రి హామీనే మళ్లీ చెప్పారు. సోమశిల ఉత్తర కాలువకు వైఎస్సార్ నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. లోకేశ్ దానిని తన తండ్రి ఖాతాలో వేసుకోవడం మరీ హాస్యాస్పందగా ఉంది. ఉత్తర కాలువ వెడల్పు పెంచేందుకు సీఎం జగన్ మోహన్‌రెడ్డి రూ.700 కోట్లు నిధులు మంజూరు చేశారు. ఈ కాలువ ద్వారా ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గంలో పలు మండలాలకు నీరు అందుతోంది. రాళ్లపాడు రిజర్వాయర్‌కు నీరిచ్చిన ఘనత ఈ ప్రభుత్వానికి దక్కుతోంది. కానీ లోకేశ్ కనీస పరిజ్ఞానం కూడా లేకుండా అధికారంలోకి వచ్చిన వెంటనే ఉత్తరకాలువను అభివృద్ధి చేస్తామని చెప్పడంపై పూర్తయిన పనిని మళ్లీ ఈయన చేస్తానని చెప్పడంతో రైతులు ముక్కున వేళ్లు వేసుకుంటున్నారు. ఫైబర్ చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు, నీరు–చెట్టు పనుల్లో రూ.కోట్లు అవినీతికి పాల్పడిన తెలుగు తమ్ముళ్ల చరిత్ర ప్రజలు మదిలో ఉన్నాయి. ఉదయగిరిలో యువగళం యాత్రలో లోకేశ్ తమ తప్పులు కప్పిపుచ్చి, ప్రభుత్వంపై ఉద్దేశపూర్వక ఆరోపణలు చేయడం స్పష్టంగా కనిపించింది. వాస్తవాలను సమాధి చేయాలని ప్రయత్నించినా, చరిత్రలో అవి సజీవంగానే ఉంటాయనే సత్యాన్ని లోకేశ్ గుర్తించకపోవడం కాలమే సమాధానం చెబుతోంది.

గాలికి వదిలేసిన సమగ్ర మంచి నీటి పథకం

2014 ఎన్నికల సందర్భంగా చంద్రబాబు ఉదయగిరి నియోజకవర్గంలో ప్రతి పల్లెకు సమగ్ర రక్షిత మంచినీరందిస్తామని హామీ ఇచ్చారు. కానీ బాబు ఆ హామీని మర్చిపోయారు. 2019 ఎన్నికలకు 3 నెలలు ముందు రూ.600 కోట్లతో ఆ ప్రాజెక్ట్‌కు వింజమూరు చెరువుకట్టపై నాటి ఎమ్మెల్యే బొల్లినేని శిలాఫలకం వేశారు. అది నేటికి ఆనాటి మోసపు వాగ్దానానికి సాక్షిగా మిగిలి ఉంది. వింజమూరు పట్టణానికి నీటి సరఫరా కోసం సమ్మర్ ట్యాంకు ఏర్పాటు కలగానే మిగిలి పోయింది. సంగం ఆనకట్ట నుంచి సురక్ష జలాలు పైపు లైన్ ద్వారా సరఫరా చేయాలని, తొమ్మిదో మైలు వద్ద ఏర్పాటుకు తలపెట్టిన సమ్మర్ ట్యాంకు పనులు అసంపూర్తిగా ఉండిపోయాయి.



వింజమూరులో పాతూరు చెరువుకట్టపై 2019లో వేసిన సమగ్ర రక్షిత మంచినీటి పథకం శిలాఫలకం

మాజీ ఎంపీ మేకపాటితో భేటీ



మాజీ ఎంపీని కలిసిన వైఎస్సార్‌సీపీ నేతలు

చేజర్ల: నెల్లూరు మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డిని చేజర్ల మండలం చిత్తలూరు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదివారం కలిశారు. నాయకులు తెల్లబాటి కృష్ణ, యడ్లపల్లి శ్రీనివాసులునాయుడు నెల్లూరులోని మేకపాటి నివాసంలో కలిసి శాలువాతో సన్మానించారు.

బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



పల్లెపాడులో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ చేసిన బీఎస్పీ నాయకులు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం పల్లెపాడులో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని బీఎస్పీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జానకీ ప్రసాద్ ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ అంబేడ్కర్ వాదులు ఆయన ఆశయాల సాధనకు నడుంబిగించాలని బహుజన సమాజ్ పార్టీని బలోపేతం చేసుకోవాలన్నారు. బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పుష్పాంజలి, ఆత్మకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి రామకృష్ణ, అధ్యక్షుడు నందా ఓబులేసు మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రజాస్వామ్యానికి పట్టుకొమ్మగా నిలిచిందని, అట్టడుగు వర్గాలు రాజ్యాధికారం కోసం పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కృష్ణ, ధర్మయ్య, జ్యోతి శ్రీనివాసులు, రజినీకాంత్, నరేష్, వెంకటేశ్వర్లు, నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలు హర్షించేలా జగనన్న పాలన

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి
- వేడుకగా 150వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం

అల్లూరు: రాష్ట్రంలో అన్ని వర్గాలు హర్షించేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఆదివారం అల్లూరు మండలంలోని పురిణిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం 150వ రోజు సందర్భంగా భారీ కేక్‌ను కట్‌చేసి, భారీ ఎత్తున బాణసంచా పేల్చి, తీన్‌మార్ బ్యాండ్‌తో వేడుకలను నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాల ప్రజలు సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం లక్ష్యమన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలతో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని, 1వ తేదీన ఇంటి వద్దకే పింఛన్ అందించడంతో అవ్వాతాతలు, దివ్యాంలాంగులు చిరునవ్వులు చిందిస్తున్నారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ పథకాలను కాపీ కొడుతూ చంద్రబాబు మేనిఫెస్టో తయారు చేసుకున్నారని ఎద్దేవా చేశారు. చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. గ్రామ స్వరాజ్య స్థాపన జగనన్నతోనే సాధ్యమైందని చెప్పారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలు కాపాడుకుంటూ అందరికీ సంక్షేమ ఫలాలు అందేలా సుపరిపాలన చేస్తున్న ఘనత మన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని కొనియాడారు. రాష్ట్రంలో విప్లవాత్మకమైన నిరణయాలతో వలంటీర్ల వ్యవస్థ ప్రవేశ పెట్టి ప్రజల వద్దకే సంక్షేమ పథకాలు నిరంతరం అమలు చేస్తున్నారని చెప్పారు. కరోనా కాలంలో ఏ ఒక్క పథకాన్ని ఆపకుండా సజావుగా సాగించారని, ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. ప్రభుత్వానికి ప్రజలకు మరింత చేరువ చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని, దేశంలోనే ఇటువంటి బృహత్తర కార్యక్రమం మరెక్కడా జరగలేదన్నారు. గత టీడీపీ పాలనకు ప్రస్తుత సీఎం జగనన్న పాలనకు వ్యత్యాసాన్ని గుర్తించాలని, గతంలో ఎన్నడూ లేని విధంగా విద్యా, వైద్య రంగాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసినట్లు చెప్పారు. ప్రభుత్వం చేస్తున్న మేలును గుర్తుంచుకుని వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శశిరేఖ, సర్పంచ్ మైనంపాటి స్వాతి, నాయకులు దండా కృష్ణారెడ్డి, నీలం సాయికుమార్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, సాధక్‌రెడ్డి, ఉస్మాన్, తాండ్ర మల్లికార్జున, సాబ్జాన్, ఆదామ్, నిమ్మల భాస్కర్, మనోహర్, చెంతాటి కరుణాకర్, బత్తల సుధ, షేక్ జంషీర్, శ్రీను, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.



150వ రోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి



సంక్షేమ బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

అభివృద్ధిపై సన్నాహక సమీక్ష సమావేశం

కావలి: కావలి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, ఇంకా చేయాల్సిన పనులు, ప్రభుత్వ పరంగా తీసుకోవాల్సిన సత్వర చర్యలు తదితర అంశాలపై స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన ఆదివారం అధికారులతో సన్నాహక సమీక్ష సమావేశం జరిగింది. ఈ నెల 26వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు నెల్లూరులోని జెడ్పీ పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అంబటి రాంబాబు అధ్యక్షతన కావలి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష సమావేశం జరగనున్నది. ఈ సమావేశంలో జిల్లాకు చెందిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్‌తో పాటు అన్ని శాఖలకు చెందిన జిల్లాస్థాయి అధికారులు పాల్గొంటున్నారని, ఈ సమావేశంలో చర్చించాల్సిన అంశాలపై ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి స్థానిక అధికారులతో చర్చించారు. జగనన్న ఇళ్లు, ఇంటి స్థలాలు, జగనన్న లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు కల్పన తదితర అంశాలపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. ప్రధానంగా కావలి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని కొత్తగా మరో చోట నిర్మించడానికి 5 ఎకరాలు కేటాయించాలని, రైతు బజారును ముసునూరులోని మందాటి చెరువు పక్కన 2.5 ఎకరాల్లో నూతనంగా నిర్మించాలని ఎమ్మెల్యే సూచించారు. ఆర్డీఓ వీకే శీనానాయక్ సమాధానం చెబుతూ అందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సమావేశంలో కావలి డీఎస్పీ ఎం.వెంకటరమణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

ప్రధాన రోడ్లకు రూ.33.30 కోట్ల నిధుల మంజూరు

- ఇప్పటికే రూ.120 కోట్లతో జలజీవన్ మిషన్ పనులు

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు నియోజకవర్గంలోని పలు ప్రధానమైన రోడ్ల అభివృద్ధికి రోడ్లు, భవనాలశాఖ ద్వారా స్థానిక ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి నిధులు మంజూరు చేయించారు. మర్రిపాడు మండలం నందవరం నుంచి దుత్తలూరు మండలం నందిపాడు వరకు రూ.9 కోట్లు, అనుమసముద్రంపేట మండలం రాజవోలు నుంచి వింజమూరు వరకు రూ.9 కోట్లు, సంగం నుంచి కలిగిరి వరకు రూ.9 కోట్లు, సంగం మర్రిపాడు నుంచి వంగల్లు వరకు రూ.2.70 కోట్లు, చేజర్ల మండలం తూర్పుకంభంపాడు నుంచి కాకివాయి వరకు రూ.3.60 కోట్లతో ఉన్న రోడ్లను అభివృద్ధి చేసేందుకు టెండర్లు పిలిచి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకున్నట్లు ఎమ్మెల్యే కార్యాలయ అధికారులు తెలిపారు. ఆత్మకూరు నియోజకవర్గంలోని 135 గ్రామ పంచాయతీల్లో జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వడంతో పాటు సమృద్ధిగా తాగునీటిని సరఫరా చేసేందుకు రూ.120 కోట్ల పనులు ముమ్మరంగా చేయిస్తున్నట్లు పేర్కొన్నారు.



మేకపాటి విక్రమ్‌రెడ్డి

మణిపూర్ హింసకు నిరసనగా ర్యాలీ



బిట్రగుంట: బోగోలులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఉదయగిరి శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బిట్రగుంట: బోగోలులో ఐక్య క్రైస్తవ సంఘం ఆధ్వర్యంలో మణిపూర్ హింసను నిరసిస్తూ, బాధితులకు బాసటగా క్రైస్తవులు ఆదివారం సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మణిపూర్ రాష్ట్రంలో 70 రోజుల నుంచి క్రైస్తవులు, మహిళలు, గిరిజనులు, చర్చిలపై జరుగుతున్న దాడులు, అమానవీయ మారణహోమాన్ని నిరసిస్తూ మండలంలోని చర్చిల ప్రతినిధులు, సంఘ కాపరులు, క్రైస్తవులు బోగోలులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి కప్పరాళ్లతిప్పలోని పోలీస్‌స్టేషన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. రాక్షస మూకల దాడులకు గురైన బాధితులకు సంఘీభావం తెలుపుతూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మణిపూర్‌లో జరుగుతున్న హింసను వెంటనే అరికట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని హింసను అరికట్టడంతో పాటు నిందితులను కఠినంగా శిక్షించాలని, బాధితులకు రక్షణ కల్పించాలని కోరారు. దాడుల్లో అమరులైన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘకాపరులు, క్రైస్తవ మతపెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

శాంతి ప్రదర్శన

ఉదయగిరి: ఉదయగిరిలో ఆదివారం రాత్రి క్రైస్తవులు మణిపూర్ గిరిజన తెగలపై జరిగిన దమనకాండను నిరసిస్తూ శాంతి ర్యాలీ నిర్వహించారు. రంగనాయకులు గుడి దగ్గర నుంచి పంచాయతీ బస్టాండ్ వరకు ర్యాలీ జరిగింది. క్రైస్తవ మతపెద్దలు మాట్లాడుతూ మణిపూర్‌లో జరిగినే, జరుగుతున్న ఘటనలు సమాజమే సిగ్గుపడేలా ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని మారణకాండకు కారకులను వెంటనే కఠినంగా శిక్షించి, శాంతిని నెలకొల్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మత పెద్దలు ఎం.అశోక్, జక్రరయ్య, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

సంగం: మండలంలోని సిద్ధీపురం ఎస్సీ కాలనీలో ఆదివారం అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఇటీవల దువ్వూరు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కాలనీకి చెందిన వలంటీర్ పవన్‌కళ్యాణ్, మరో యువకుడు మధు మృతి చెందడంతో వారి జ్ఞాపకార్థంగా రెడ్‌క్రాస్ సహకారంతో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. సుమారు 30 మందికి పైగా యువకులు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో జిల్లాలో రక్తం లేక ఇబ్బందులు పడుతున్న అనేక మందికి రక్తం అందజేస్తున్నామని తెలిపారు. తలసేమియాతో బాధపడుతున్న పిల్లలకు రక్తం అందిస్తున్నారన్నారు.



ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

ఉదయగిరి(వింజమూరు): క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడమే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం లక్ష్యమని ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. వింజమూరు మండలం కాటేపల్లి సచివాలయం పరిధిలోని తమిదపాడు, మాధవ నగర్, నల్లారెడ్డిపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆదివారం ఆయన నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రభుత్వ పనితీరు, సంక్షేమ పథకాల అమలు, ప్రజల సమస్యలపై ఆరాతీశారు. మాధవనగర్‌లో ఎస్టీలు విద్యుత్ సమస్యను విన్నవించగా, వెంటనే ట్రాన్స్‌కో ఏఈతో మాట్లాడి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కోరారు. తాగునీటి సమస్యను విన్నవించగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. రాబోయే ఎన్నికల్లోనూ జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకుని సీఎంగా చేసుకోవాలని ఎదురు చూస్తున్నారు. టీడీపీ నాయకులు, పచ్చ మీడియా ఎన్ని కుట్రలు పన్నినా మళ్లీ రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం ఖాయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గణపం బాలకృష్ణారెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు పురుషోత్తం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రేవుపూరి శ్రీనివాసరెడ్డి, నాయకులు గోవిందరెడ్డి, బీ విజయ్‌రెడ్డి, ఎం బ్రహ్మారెడ్డి, ఎం గురుప్రసాద్, ఎం బాలు, గువ్వల కృష్ణారెడ్డి, బోరెడ్డి చంద్ర, నేరేడుపల్లి శ్రీను, గాజుల పారుఖ్‌అలీ, గాజుల తాజుద్దీన్, ఎంపీడీఓ కిరణ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.



మాధవనగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ప్రజా సింహగర్జనకు నాయకులు



విజయవాడకు తరలివెళ్తున్న యాదవ సంఘాల నాయకులు

జలదంకి: విజయవాడలో ఆదివారం జరిగిన ప్రజా సింహగర్జన కార్యక్రమానికి జలదంకి మండలం గట్టుపల్లి రోడ్డు నుంచి ఉదయగిరి నియోజకవర్గం యాదవులు తరలి వెళ్లారు. యాదవ సంఘం నేతలు, మర్రిబోయిన మధుకిషోర్ యాదవ్, యనమల శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీల రాజ్యాధికారం కోసం చేస్తున్న పోరాటమని తెలిపారు. బీసీల రాజ్యాధికారం కోసం బోడి రామచంద్రయాదవ్ చేస్తున్న కృషికి మద్దుతుగా ఉంటామన్నారు. దాదాపుగా ఉదయగిరి నియోజకవర్గం నుంచి 80 వాహనాల్లో సభకు బయలుదేరి వెళుతున్నట్లు తెలిపారు. రామచంద్రయాదవ్ పేద కుటుంబంలో పుట్టి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల రాజ్యాధికారం కోసం కృషి చేస్తున్నారని, ఆయనకు ప్రతి ఒక్కరం అండగా నిలబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యాదవ్ సంఘ నాయకులు కుట్టుబోయిన కృష్ణయాదవ్, మారుబోయిన రమేష్ యాదవ్, బొమ్చు మల్లికార్జున యాదవ్, అత్తిన చైతన్యయాదవ్, బొమ్చు ప్రసాద్ యాదవ్, నల్లా మహేంద్ర యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి పొంగళ్లు

జలదంకి: జలదంకి గ్రామదేవత పోలేరమ్మ తల్లికి భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు.